
## లాభాల్లోకి బీఎస్ఎన్ఎల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.262 కోట్ల లాభాన్ని ఆర్జించింది. 17 ఏండ్ల తర్వాత తొలిసారిగా సంస్థ లాభాలను ఆర్జించడం విశేషమని కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్యా సింధియా తెలిపారు. వ్యాపారాన్ని మరింత విస్తరించడంతోపాటు చందాదారులను పెంచుకోవడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. జూన్ త్రైమాసికంలో 8.4 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉండగా, అదే డిసెంబర్ చివరినాటికి ఈ సంఖ్య 9 కోట్లకు పెరిగినట్లు వెల్లడించారు. మొబిలిటీ సేవలు అందించడంతో వచ్చిన ఆదాయంలో 15 శాతం వృద్ధి నమోదుకాగా, అలాగే ఫైబర్-టూ-ది-హోమ్(ఎఫ్‌టీటీహెచ్) ఆదాయంలో 18 శాతం పెరుగుదల కనిపించింది. మరోవైపు, ఆర్థిక చెల్లింపులు, నిర్వహణ ఖర్చులు రూ.1,800 కోట్లకు తగ్గించుకోగలిగింది. 4జీ సర్వీసులను విస్తరించడానికి దేశవ్యాప్తంగా లక్ష టవర్లను ఏర్పాటు చేయడంలో భాగంగా ఇప్పటి వరకు 75 వేల టవర్లను ఇన్‌స్టాల్ చేసినట్లు, వీటిలో 60 వేల టవర్లు అందుబాటులోకి వచ్చాయని మంత్రి చెప్పారు. ఈ ఏడాది జూన్ నాటికి లక్ష టవర్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నదన్నారు.

# ఎఫ్ఐఐ.. 'ఘర్ వాపసీ'

- తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు
- దేశీయ స్టాక్ మార్కెట్లలో దశాబ్దం కనిష్ఠానికి చేరిక
- గత నెల రూ.78,000 కోట్లు ఉపసంహరణ
- ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా లక్ష కోట్లపైనే వెనక్కి



ముంబై, ఫిబ్రవరి 14: విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఇంటిదారి పట్టారు. భారతీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వీలైనంత ఎక్కువగా వెనక్కి తీసేసుకుంటున్నారు. దేశీయంగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్ఐఐల్లో సుమారు 35 శాతం అమెరికాకు చెందినవారే. అగ్రరాజ్యాధినేత ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వీరి పెట్టుబడుల ఉపసంహరణలు ఇటీవలికాలంలో పెరిగాయి. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.78,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకోవడం గమనార్హం. గత నెల 23 రోజులు ట్రేడింగ్ జరిగితే 22 రోజులు ఎఫ్ఐఐలు అమ్మకాలకే పెద్దపీట వేశారు. ఫిబ్రవరిలోనూ ఇదే జరుగుతుండగా.. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తరలిపోయిన విదేశీ పెట్టుబడుల విలువ లక్ష కోట్ల రూపాయలపైనే ఉన్నట్టు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) ద్వారా అందుతున్న సమాచారం. ఈ నెలలో 10 రోజులపాటు ట్రేడింగ్ జరిగితే, 9 రోజులు పెట్టుబడుల ఉపసంహరణలే. ఈ క్రమంలోనే ఈ నెలలో ఇప్పటిదాకా రూ.27,856.34 కోట్లు వెనక్కిపోయినట్టైంది.

### మోదీ హయాంలో..

ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో విదేశీ పెట్టుబడిదారులు యూటర్న్ తీసుకోవడం ఇప్పుడు అత్యంత గమనించదగ్గ అంశంగా నిలుస్తున్నది. గడిచిన పదేండ్లలో భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎఫ్ఐఐ పెట్టుబడుల వాటా 4 శాతానికిపైగా క్షీణించింది. 2015 జనవరిలో 20.2 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 16 శాతంగా ఉన్నది. ఇది 12 ఏండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఇక గత ఏడాది అక్టోబర్ నుంచి ఎఫ్ఐఐలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిలోనే ఉంటున్నారు. అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారు. నిరుడు డిసెంబర్‌తో పోల్చితే గత నెల జనవరిలో ఎఫ్ఐఐ ఈక్విటీ అసెట్స్ అండర్ కస్టడీ (ఏయూసీ) కూడా రూ.67.7 లక్షల కోట్లకు పడిపోయాయి. డిసెంబర్ ఆఖర్లో రూ.71.1 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంతో నెల రోజుల్లో రూ.3.4 లక్షల కోట్లు హరించుకుపోయినట్టు తేలింది.

### బ్యాంకింగ్, ఐటీకి దూరం

బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లకు ఎఫ్ఐఐలు దూరంగా ఉంటున్నారు. ఒక్క జనవరిలోనే 2.8 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులను బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) సూచీ నుంచి ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకున్నారు. ఐటీ రంగం నుంచి కూడా 747 మిలియన్ డాలర్ల పెట్టుబడులు తరలిపోయాయి. ఇక చమురు-గ్యాస్, ఆటో రంగాల షేర్లపై పెట్టిన పెట్టుబడులూ తగ్గిపోతున్నాయి. ఆటో నుంచి 672 మిలియన్ డాలర్లు వెళ్లిపోయాయి. కాగా, అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కారు ఖాయమైన దగ్గర్నుంచే ఎఫ్ఐఐలు.. భారతీయ మార్కెట్లకు మరింత దూరంగా కదులుతున్నారు. డాలర్ విలువ పెరిగి రూపాయి బలహీనపడటం, స్టాక్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకోవడం, బంగారం ఆకర్షణీయంగా మారడం, పరస్పర సుంకాలతో వాణిజ్య యుద్ధం భయాలు వెంటాడటం వంటివి ఎఫ్ఐఐలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నట్టు మార్కెట్ నిపుణులు చెప్తున్నారు.

# గోల్డ్ @ 89,400

- ఒక్కరోజే తులం రూ.1,300 పెరిగిన ధర
- దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హైకి
- రూ.2 వేలు ఎగిసి లక్షకు చేరిన కిలో వెండి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు తొలిసారి రూ.89,000 మార్కును దాటాయి. ఢిల్లీలో మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పసిడి రేటు ఆల్‌టైమ్ హైని తాకుతూ శుక్రవారం ఏకంగా రూ.89,400 పలికింది. ఈ ఒక్కరోజే రూ.1, 300 పెరగడం గమనార్హం. హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున కనిపించిన డిమాండే ఇందుకు కారణమని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనే మొదటిసారి రూ.85,000 మార్కును దాటిన మేలిమి బంగారం ధర.. కేవలం 10 రోజుల్లో రూ.4, 000లకుపైగా ఎగబాకడం గమనార్హం.

### హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.87,160గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పుత్తడి రేటు రూ.79,900 పలికింది. ఇదిలావుంటే దేశ రాజధానిలో కిలో వెండి విలువ రూ.2,000 పెరిగి 4 నెలల గరిష్ఠాన్ని తాకుతూ లక్ష రూపాయలకు చేరింది. నగల వ్యాపారులతోపాటు నాణేల తయారీదారులు, పరిశ్రమల నుంచి డిమాండ్ వ్యక్తమైందని బులియన్ ట్రేడింగ్ వర్గాలు చెప్తున్నాయి. కాగా, ఫ్యూచర్స్ ట్రేడ్ విషయానికొస్తే.. ఎంసీఎక్స్‌పై ఏప్రిల్ నెల డెలివరీకిగాను గోల్డ్ కాంట్రాక్ట్స్ 10 గ్రాములు రూ.85,993 పలికింది. వెండి కిలో రూ.97,750గా నమోదైంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 2,929.79 డాలర్లుగా ఉన్నది.



## ఏబీఎస్‌తో పల్సర్ ఎన్ఎస్125

**ప్రారంభ ధర రూ.1.06 లక్షలు**

పూణె, ఫిబ్రవరి 14: ప్రపంచంలో అత్యంత విలువైన ద్విచక్ర వాహన సంస్థల్లో ఒకటైన బజాజ్ ఆటో.. దేశీయ మార్కెట్లోకి మరో పల్సర్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యాంటిబ్రేకింగ్ సిస్టమ్(ఏబీఎస్)తో తయారైన పల్సర్ ఎన్ఎస్125 బైకు ధర రూ.1, 06, 739గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా బైకును ఆధునీకరించినట్లు, ముఖ్యంగా ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, డిజిటల్ కన్సోల్, బ్లూటూత్ కనెక్టివిటీ, యూఎస్‌బీ చార్జర్ వంటి టెక్నాలజీతో తయారు చేసింది. 125 సీసీ సెగ్మెంట్‌లో అత్యంత శక్తివంతమైన ఈ బైకు 12 పీఎస్‌ల శక్తినివ్వనున్నది.

**6,700 కోట్ల ఆర్డర్ పొందిన సంస్థ**

## భెల్‌కు సింగరేణి భారీ ఆర్డర్

హైదరాబాద్, ఫిబ్రవరి 14: ప్రభుత్వానికి చెందిన విద్యుత్ పరికరాల సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్) మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. రాష్ట్రంలో సింగరేణి కాలరీస్ కంపెనీ నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ యూనిట్‌కు సంబంధించిన రూ.6,700 కోట్ల విలువైన ఆర్డర్ భెల్ దక్కించుకున్నది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా ఈ ప్రాజెక్టునకు సంబంధించి డిజైనింగ్, ఇంజినీరింగ్, తయారీ, సరఫరా, కమిషనింగ్‌తోపాటు సివిల్ వర్క్ చేయాల్సి ఉంటుందని భెల్ ఒక ప్రకటనలో పేర్కొంది. మంచిర్యాల జిల్లాలో సింగరేణి సంస్థ నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ఆదిలాబాద్ సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టును ఈపీసీ(ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిన నిర్మించాల్సివుంటుందని భెల్ పేర్కొంది. ఇప్పటికే సింగరేణికి చెందిన 1,200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులను భెల్ నిర్వహించింది.

## మహీంద్రా ఈవీలకు డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: మహీంద్రా అండ్ మహీంద్రాకు చెందిన ఈవీలకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థకు చెందిన ఎక్స్‌ఈవీ 9ఈ, బీఈ 6 మాడళ్లకు తొలిరోజే 30,170 బుకింగ్‌లు వచ్చాయని తెలిపింది. వీటి మొత్తం నికర విలువ రూ.8,472 కోట్లు(షోరూం ధర ప్రాతిపదికన). ఈ విషయాన్ని మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా తన ఎక్స్‌లో వెల్లడించారు. గత నెలలో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ రెండు మాడళ్లపై ఈ శుక్రవారం నుంచి కమర్షియల్ బుకింగ్‌ను ఆరంభిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కారు రూ.18.9 లక్షల నుంచి రూ.30.5 లక్షల లోపు లభించనున్నది.

# 8 రోజులు..2,644 పాయింట్లు

- గత ఎనిమిది సెషన్లలో నష్టపోయిన సెన్సెక్స్
- రూ.25.31 లక్షల కోట్ల సంపద ఆవిరి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: స్టాక్ మార్కెట్ల భీకర నష్టాలతో మదుపరులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్‌లను విధించడానికి సిద్ధమవుతుండటంతో దేశీయ సూచీలు భారీగా నష్టపోయాయి. గడిచిన ఎనిమిది రోజుల్లో దేశీయ ప్రామాణిక మార్కెట్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 2,644.6 పాయింట్లు లేదా 3.36 శాతం పడిపోయింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 810 పాయింట్లు లేదా 3.41 శాతం జారుకున్నది. దీంతో మదుపరులకు చెందిన లక్షల కోట్ల సంపద హారతికర్పూరంలా కరిగిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకుంటుండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధంపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో ఈక్విటీలు కుదేలయ్యాయి. దీంతో గత ఎనిమిది సెషన్లలో మదుపరులు రూ.25.31 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.25,31,579.11 కోట్లు కరిగిపోయి రూ.4,00,19,247 కోట్లు(4.61 ట్రిలియన్ డాలర్లకు) పడిపోయింది. మదుపరులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ముఖ్యంగా విదేశీ నిధులు తరలిపోవడం ఈ ఆందోళనను మరింత పెంచుతున్నదని మెటా ఈక్విటీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సీ తెలిపారు. డిసెంబర్ త్రైమాసికంలో కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందన్నారు. అలాగే వారాంతం ట్రేడింగ్ శుక్రవారం కూడా సెన్సెక్స్ 199.76 పాయింట్లు, నిఫ్టీ 102 పాయింట్లు నష్టపోయాయి.

### దేశీయ ఫార్మాకు ట్రంప్ టారిఫ్ సెగ

దేశీయ ఫార్మా రంగం కుప్పకూలుతున్నది. విదేశాల నుంచి దిగుమతయ్యే ఏ వస్తువుపైన దిగుమతి సుంకాన్ని విధించబోతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఇతర దేశాలు అతలాకుతలమవుతున్నాయి. దీంట్లోభాగంగా అమెరికా మార్కెట్‌పై అత్యధికంగా ఆధారపడుతున్న దేశీయ ఫార్మా సంస్థలకు ఇది కోలుకోలేని దెబ్బ. దీంతో హెల్త్‌కేర్ రంగానికి చెందిన షేర్లు కుప్పకూలుతున్నాయి. గత ఐదు రోజుల్లో ఆరు శాతం వరకు హెల్త్‌కేర్ ఇండెక్స్ నష్టపోయింది. ఒకవేళ ట్రంప్ ఫార్మా ఉత్పత్తులపై దిగుమతి సుంకం విధిస్తే అమెరికాలో ఔషధ ధరలు పెరిగే అవకాశాలుంటాయని ఫార్మా ప్రతినిధి ఒకరు తెలిపారు.



చిత్రం

# ఇక డ్యాన్స్ వార్!






హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ ఇద్దరూ మంచి డ్యాన్సర్లు.. వీళ్లు కాలు కదిపితే చాలు థియేటర్లో విజిల్స్ పడాల్సిందే. అలాంటిది ఏకంగా వీరిద్దరూ కలిసి నువ్వానేనా అనే రేంజ్‌లో డ్యాన్స్‌లో పోటీపడితే ఇక ఆ పోరు ఆద్యంతం రక్తికట్టాల్సిందే. అందుకు 'వార్-2' సినిమా వేదిక కాబోతున్నది. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వార్-2' చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఆయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. హై ఇంటెన్సిటీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో పాటను తెరకెక్కించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేసున్నది. ఇందులో హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కలిసి డ్యాన్స్ చేస్తారట. ఇద్దరు బెస్ట్ డ్యాన్సర్ల మధ్య పోటీ ఎలా ఉంటుందో ఈ పాటను చూస్తే అర్థమవుతుందని బాలీవుడ్ ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ నెలలోనే ఈ పాటను తెరకెక్కించబోతున్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో 'వార్-2' ప్రేక్షకుల ముందుకురానుంది.

## తెలియని శక్తి నడిపిస్తుంది!



అగ్ర కథానాయిక రష్మిక మందన్న బహుముఖప్రజ్ఞాశాలి. నటనతో పాటు పుస్తక పఠనం, చిత్రలేఖనంలో కూడా ఆమెకు మంచి ప్రవేశం ఉంది. ఇంగ్లీష్ సాహిత్యంలో పట్టభద్రురాలైన ఈ సొగసరి పుస్తకాలు బాగా చదువుతుంది. తాను చదివిన పుస్తకాల తాలూకు విశేషాలను సోషల్‌మీడియా ద్వారా పంచుకుంటుంది. మంచి చదువరి కావడం వల్ల ఈ భామ మాటల్లో కాస్త ఫిలాసఫీ ధ్వనిస్తుంటుంది. తాజా ఇంటర్వ్యూలో ఆమె ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. తాను జీవితాన్ని మరీ సీరియస్‌గా తీసుకోనని, నిజాయితీగా పనిచేస్తూ ముందుకుసాగుతానని, ఏదో తెలియని శక్తి తనను నడిపిస్తుందని బలంగా విశ్వసిస్తానని చెప్పుకొచ్చింది. రష్మిక మాట్లాడుతూ 'అతిగా ఆలోచించడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. అందుకే సిన్సియర్‌గా నా పని పూర్తిచేయడంపైనే దృష్టిపెడతా. ఇక సినిమాల విజయంపై కూడా పెద్దగా అంచనాలు పెట్టుకోను. ఎందుకంటే సమిష్టిగా చేసే పనిలో విజయం ఏ ఒక్కరిపైనా ఆధారపడి ఉండదు' అని పేర్కొంది. సినిమాల ఎంపికలో తాను కథకే అత్యంత ప్రాధాన్యం ఇస్తానని, కథ నచ్చితే తల్లి పాత్రలే కాదు బామ్మ పాత్ర చేయడానికి కూడా ఆలోచించనని రష్మిక మందన్న తెలిపింది. ఈ భామ నటించిన హిందీ చిత్రం 'ఛావా' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది.

## వేర్ ఎవర్ యూ గో..



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న హీస్ట్ కామెడీ చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో పెద్దల సంపదను దోచి పేదలకు పంచే రాబిన్‌హుడ్‌గా నితిన్ కనిపించనున్నారు. శుక్రవారం ఈ సినిమా నుంచి 'వేర్ ఎవర్ యు గో..' అనే రెండో గీతాన్ని విడుదల చేశారు. వివిధ బ్రాండ్‌ల క్యాప్షన్‌ల ద్వారా హీరో తన ప్రేమను వ్యక్తం చేసే కాన్సెప్ట్‌తో ఈ పాటను డిజైన్ చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ కంపోజ్ చేసిన ఈ పాటను కృష్ణకాంత్ రచించారు. స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్‌తో నితిన్, శ్రీలీల మధ్య కెమిస్ట్రీ ఈ పాటలో ప్రధానాకర్షణగా నిలిచింది. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. వినోదప్రధానంగా సాగే యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ఇదని మేకర్స్ తెలిపారు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: వెంకీ కుడుముల.



## న్యూఏజ్ లవ్‌స్టోరీ 'తెలుసు కదా'

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. స్టైలిస్ట్ నీరజా కోన దర్శకురాలిగా పరిచయమవుతున్నది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. రాశీఖన్నా, శ్రీనిధిశెట్టి కథానాయికలు. శుక్రవారం వాలెంటైన్స్ డే సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'న్యూ జనరేషన్ లవ్‌స్టోరీ ఇది. ముక్కోణపు ప్రేమకథగా తెరకెక్కించాం. లవర్‌బాయ్‌గా సిద్ధు జొన్నలగడ్డ పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: నీరజ కోన.

## తొలిప్రేమ జ్ఞాపకాల్లో..



హీరో నాని సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'కోర్ట్-స్టేట్ వర్సెస్ ఏ నోబడీ' ఉపశీర్షిక. ప్రియదర్శి ప్రధాన పాత్రధారి. హర్ష్ రోషన్, శ్రీదేవి, శివాజీ, సాయికుమార్, రోహిణి కీలక పాత్రల్ని పోషించారు. రామ్‌జగదీష్ దర్శకుడు. ప్రశాంత్ తిపిర్నేని నిర్మాత. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ చిత్రం నుంచి 'ప్రేమలో..' అనే పాటను విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ పాటను పూర్ణాచారి రచించారు. అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ ఆలపించారు నాయకానాయికల మధ్య ప్రేమకథను ఆవిష్కరిస్తూ చక్కటి మెలోడీతో ఈ పాట సాగింది. సమకాలీన అంశాలను చర్చిస్తూ సామాజిక సందేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, మార్చి 14న విడుదల చేస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాత: దీప్తి గంటా, కథ, దర్శకత్వం: రామ్ జగదీష్.

## హృద్యమైన ప్రణయగాథ



మోహిత్ పెద్దాడ హీరోగా నటిస్తున్న చిత్రం 'నా లవ్ స్టోరీ'. వినయ్ గోను దర్శకుడు. దొమ్మరాజు అమరావతి, శ్రీకాంత్ రెడ్డి నిర్మాతలు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను 'ఆర్ఎక్స్ 100ఫేమ్' దర్శకుడు అజయ్‌భూపతి లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఫస్ట్‌లుక్ ఇన్నోవేటివ్‌గా ఉందన్నారు. కాలేజీ స్టూడెంట్స్ హాస్టల్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే హృద్యమైన ప్రేమ కథాంశమిదని, నేటి యువత బాగా కనెక్ట్ అవుతుందని దర్శకుడు తెలిపారు. హార్ట్‌టచింగ్‌గా సాగే ప్రేమకథకు సంగీతాన్నందించడం ఆనందంగా ఉందని మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్ పేర్కొన్నారు. మార్చి మొదటి వారంలో షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: లోకేష్ తాళ్లపాక, సంగీతం: చరణ్ అర్జున్, నిర్మాణ సంస్థలు: మహీర క్రియేషన్స్, సుప్రియ ఆర్ట్స్, రచన-దర్శకత్వం: వినయ్ గోను.

## సరికొత్త కాన్సెప్ట్‌తో డ్యాన్స్ ఐకాన్ 2

డ్యాన్స్ ప్రేమికులను అలరించిన 'డ్యాన్స్ ఐకాన్ సీజన్ 1' డాన్స్ షోకు కొనసాగింపుగా రూపొందిన డ్యాన్స్ షో 'డ్యాన్స్ ఐకాన్ సీజన్ 2 వైల్డ్‌ఫైర్'. శుక్రవారం నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో ఈ డాన్స్ షో స్ట్రీమింగ్ మొదలైంది. ప్రముఖ యాంకర్, దర్శకుడు, డ్యాన్స్ ఐకాన్ సీన్ 2 హోస్ట్ అయిన ఓంకార్, ఫరియా అబ్దుల్లా హోస్టులుగా, శేఖర్ మాస్టర్ జడ్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ 'డాన్స్ ఐకాన్2-వైల్డ్‌ఫైర్'లో అయిదుగురు కంటెస్టెంట్స్ మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తారని, దేశవ్యాప్తంగా కంటెస్టెంట్స్ పాల్గొంటున్నారని హోస్ట్ ఓంకార్ తెలిపారు. ఇంకా ఆయన చెబుతూ 'ఇప్పటివరకూ వచ్చిన డ్యాన్స్ షోల్లో ఇది పూర్తి భిన్నమైంది. ప్రతిభ కలిగిన తెలుగువాళ్లను సీక్రెట్ స్క్రీనింగ్ ద్వారా సెలక్ట్ చేస్తున్నాం. మరింత టఫ్ కాంపిటీషన్లో తెలుగువారి సత్తా చాటాలనే సంకల్పంతోనే ఈ ప్రయత్నం చేస్తున్నాం. ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు షో స్టార్ట్ అవుతుంది' అని ఓంకార్ తెలిపారు. ఇంకా మెంటార్లు మానస్, యష్, ప్రకృతి కూడా మాట్లాడారు.



## 1950ల నాటి కాంత



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. శుక్రవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె సంప్రదాయ వస్త్రధారణతో కనిపిస్తున్నది. '1950 మద్రాస్ నేపథ్యంలో నడిచే కథాంశమిది. ఆనాటి మానవ సంబంధాలు, సామాజిక సంక్లిష్టతలకు అద్దం పడుతుంది. భాగ్యశ్రీ బోర్సే పాత్రకు కథాగమనంలో చాలా ప్రాముఖ్యత ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జాను, నిర్మాతలు: రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్, దర్శకత్వం: సెల్వమణి సెల్వరాజ్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.